'ప్రైవేట్ ఉపాధ్యాయులను హేళన చేయడం సరికాదు'

కరీంనగర్ టౌన్, ఆగస్టు 4: ప్రైవేట్ పాఠశాలల టీచర్లను సీఎం రేవంత్‌రెడ్డి హేళన చేయడం సరికాదని బీఎస్ రావు ఫౌండేషన్ చైర్మన్, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ బీఎస్‌రావు ఒక ప్రకటనలో ఖండించారు. భావిభారత పౌరు లైన విద్యార్థులను తీర్చిదిద్దుతున్న టీచర్లను గౌరవించాల్సింది పోయి ఇంటర్, డిగ్రీ చదివారంటూ అవహేళన చేస్తూ మాట్లాడడం వారిని అవమానించడ మేనని అన్నారు. టీచర్లను గౌరవించడం సీఎం నేర్చుకోవాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించి, ప్రైవేట్‌కు దీటుగా తీర్చిదిద్దాలని సూచించారు.

చిన్ననాటి మిత్రులతో కేంద్ర హోం శాఖ మంత్రి బండి సంజయ్



ఫ్రెండ్‌షిప్‌డే వేడుకల్లో మిత్రులతో కలిసి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, ఆగస్టు 4: ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ చిన్ననాటి మిత్రులతో సరదాగా గడిపారు. ఆదివారం సరస్వతి శిశుమందిర్‌లో తనతో పాటుకలిసి చదువుకున్న 35 మంది హైదరాబాద్ ఎల్బీనగర్‌లోని మన్సూరాబాద్‌లో బండి సంజయ్‌ను కలిసి వేడుకలు నిర్వహించారు. అనుకోకుండా వచ్చిన స్నేహితులందరినీ చూసిన బండి సంజయ్ పేరు పేరునా పలకరిస్తు పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. మిత్రులందరిని పలకరిస్తు కుటుంబ క్షేమ సమాచారాలు తెలుసుకున్నారు. చిన్ననాటి స్నేహితులను కలవడం ఆనందంగా ఉందని బండి సంజయ్ ఆనందం వ్యక్తం చేశారు.





కరీంనగర్ అర్బన్, ఆగస్టు 4: రూఫ్‌టాప్ సోలార్ ప్యానెళ్లతో విద్యుత్ ఉత్పత్తితో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 'పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన'కు అనూహ్య స్పందన లభిస్తున్నది. ఇంటిపై సోలార్ ప్యానెల్లను ఏర్పాటు చేసుకుని సూర్యరశ్మి ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసుకునేలా కేంద్ర ప్రభుత్వం ఈ పథకానికి రూపకల్పన చేసింది. ఈ పథకం కింద లబ్దిదారులకు సబ్సిడీతోపాటు బ్యాంక్‌ల ద్వారా రుణసదుపాయాన్ని అందిస్తుంది.

'సూర్యఘర్' పథకానికి అనూహ్య స్పందన

- ఉమ్మడి జిల్లాలో 248 దరఖాస్తులు
- ఆన్‌లైన్ ద్వారా నమోదుకు అవకాశం

దరఖాస్తు ఇలా..

ఈ పథకంలో చేరాలంటే ముందుగా 'సూర్యఘర్ యాప్'ను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలి లేదా ఆన్‌లైన్‌లో అందులో వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. నేరుగా కరీంనగర్ రెడ్‌కో కార్యాలయంలో దరఖాస్తులు అందించాలి. దరఖాస్తుతో ఆరు నెలల కరెంటు బిల్లు కాపీని జతపర చాలి. తరువాత రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. విద్యుత్ వాడకం 300 యూనిట్లలోపు మాత్రమే ఉండాలన్న నిబంధన ఉంది. అనంతరం ట్రాన్స్‌కో అనుమతులు పొందాక వెండర్లను ఎంపిక చేసుకోవాలి. ఇందులో కిలో వాట్‌కు నిర్ణయించిన దాని ప్రకారం సబ్సిడీ ఇస్తారు. మిగిలిన మొత్తానికి బ్యాంకు రుణ సదుపాయం కల్పిస్తారు. చివరగా ఇంటి రూఫ్‌పై వంద చదరపు అడుగుల స్థలంలో సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం వాడే మీటర్ స్థానంలో నెట్ మీటర్ ఏర్పాటు చేస్తారు. దీని ద్వారా సోలార్ ఉత్పత్తి, వినియోగదారుడు వినియోగిస్తున్న విద్యుత్‌ను లెక్కిస్తారు. వినియోగదారుడు పెట్టిన పెట్టుబడి 6 నుంచి 7 సంవత్సరాల్లో తిరిగి పొందేందుకు అవకాశముంది. సోలార్ రూఫ్ టాప్ ప్యానళ్లు సూర్యుని వేడిని గ్రహించడం ద్వారా ఇంటిలో వేడి తగ్గుతుంది. నెట్ మీటర్ అమర్చిన తరువాత వినియోగదారులు పోర్టల్‌లో బ్యాంక్ ఖాతా వివరాలు అప్‌లోడ్ చేయాలి. సబ్సిడీ మొత్తాన్ని ప్రభుత్వం 45 నుంచి 60 రోజుల్లో చెల్లిస్తుంది. ఒక కిలో వాట్ రూఫ్ టాప్ కెపాసిటీ కోసం 1 మీటరు వెడల్పు, 1.6 మీటర్ల ఎత్తుతో ప్యానల్స్‌ను అమర్చుతారు. ఒక కిలో వాట్ సోలార్ రూఫ్ టాప్ ప్యానల్ నెలకు దాదాపు 125 పైగా యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తుంది. ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు 248 మంది ఈ పథకం కింద దరఖాస్తు చేసుకున్నారు. కిలో వాట్ సోలార్ యూనిట్‌కు 1.10 లక్షలు, రెండు కిలో వాట్స్‌కు 1.54 లక్షలు, మూడు కిలో వాట్స్ యూనిట్‌కు 2.18 లక్షల రూపాయల వ్యయం అవుతుంది.

విద్యుత్ ఉత్పత్తి, రాయితీలు

కిలోవాట్ రూఫ్‌టాప్ ఏర్పాటుతో నెలకు 120 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. రెండు కిలోవాట్స్‌తో 240 యూనిట్లు, మూడు కిలోవాట్స్‌తో 340 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ఇందులో కిలోవాట్‌కు 30 వేలు, రెండు కిలో వాట్స్‌కు 60 వేలు, మూడు నుంచి ఐదు కిలోవాట్స్ వరకు 78 వేల రూపాయల రాయితీని కేంద్రప్రభుత్వం కల్పిస్తోంది.

కేటగిరీ-1 మీటర్ ఉన్న వారందరూ అర్హులే

సందీప్‌కుమార్, టీజీ రెడ్‌కో జిల్లా మేనేజర్



కేటగిరీ 1 మీటర్ కలిగిన ఇళ్లు ఉన్న వారందరు ఈ పథకానికి అర్హులే. దరఖాస్తు చేసుకునేందుకు ఆధార్‌కార్డు, విద్యుత్ బిల్లు కాపీ, లబ్ధిదారుడి ఫోటో, పాన్‌కార్డు, బ్యాంక్ ఖాతా నంబర్ దరఖాస్తు వెంట జతపరచాలి. అన్ని జాతీయ బ్యాంక్‌లు ఈ పథకానికి రుణసదుపాయాన్ని అందిస్తాయి. దరఖాస్తు చేసుకుని, మంజూరు అయిన 10 రోజుల్లో రుణం అందిస్తారు. ఈ సోలార్ ప్యానెళ్లను అమర్చిన సంస్థ ఐదేళ్ల వరకు సర్వీసును, వారంటీని అందిస్తుంది. 'పీఎం సూర్యఘర్ ముఫ్త్‌బిజిలీ యోజన' పథకానికి దరఖాస్తు చేసుకునేవారు కరీంనగర్ రెడ్‌కో మేనేజర్ కార్యాలయం (ఆర్ అండ్‌బీ గెస్ట్‌హౌస్ వెనుకవైపు), ఫోన్ నంబరు 6304903918లో సంప్రదించాలి.



సూర్యఘర్' పథకంలో ఏర్పాటు చేసిన సోలార్ యూనిట్లను పరిశీలిస్తున్న రెడ్‌కో జిల్లా మేనేజర్ పి సందీప్‌కుమార్

వీధి దీపాల నిర్వహణ గాలికి..

- నిర్వహణ ఖర్చులను దర్జాగా తీసుకుంటున్న ఈఈఎస్ఎల్ ఏజెన్సీ
- బల్దియా కార్మికులతోనే పనులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

కరీంనగర్ టౌన్, ఆగస్టు 4: నగరంలో వీధి దీపాల నిర్వహణను గాలికి వదిలేశారు. స్మార్ట్ సిటీ రోడ్ల పక్కన ఆకర్షణీయంగా ఏర్పాటు చేసిన వీధి దీపాలను పట్టించుకోవడ లేదు. నగరానికే కాదు జిల్లాకే వ్యాపార కేంద్రమైన టవర్ సర్కిల్ ప్రాంతం నుంచే స్మార్ట్‌సిటీకి శ్రీకారం చుట్టగా ఇప్పటికీ అక్కడ అండర్ గ్రౌండ్ కేబుల్ వర్క్ పూర్తి చేయలేదు. దీంతో రాత్రి వేళల్లో చీకట్లు కమ్ముకుంటున్నాయి. ఒకప్పుడు నగరంలో వీధిదీపాల నిర్వహణకు ప్రస్తుత నిర్వహణకు చాలా వ్యత్యాసం ఉంది. వీధిదీపాల నిర్వహణ బాధ్యతను ఈఈ ఎస్ఎల్ ఏజెన్సీకి అప్పగించడంతో నగరంలోని హైమాస్ట్ లైట్లు, ఎల్ఈడీ లైట్లను వారే ఆన్ ఆఫ్ చేయడం మొదలుకొని వాటి మరమ్మతులు కూడా చేయాల్సి ఉంది. నగరం నలువైపులా ప్రధాన రహదారుల్లో సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఉంది. నగరంలో ఎక్కడ వీధిదీపాల సమస్య తలెత్తినా నగరపాలక సంస్థ 48 గంటల్లోపు ఆ సమస్యను పరిష్కరిస్తామని గతంతో ప్రకటించారు.

నగరంలోని 60 డివిజన్లలో 27,101 ఎల్ఈడీ వీధిదీపాలను ఏర్పాటు చేశారు. వీధి దీపాల నిర్వహణ బాధ్యతను ఈఈఎస్ఎల్ ఏజెన్సీకి అప్పగించారు. కొద్ది నెలల వరకు వీధిదీపాల నిర్వహణ సవ్యంగానే జరుగగా ఇప్పుడు సదరు ఏజెన్సీ పట్టించుకోవడ లేదు. నిర్వహణ ఖర్చులను బల్దియా నుంచి తీసు కుంటుం ది కానీ చెడిపోయిన లైట్లకు మరమ్మ తులు చేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.



● పలు చోట్ల వెలగని లైట్లు

నగరంలో పలు చోట్ల లైట్లు వెలుగడం లేదు. వీధిదీపాల నిర్వహణ ఖర్చులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో సదరు ఏజెన్సీ వారు స్పందించడం లేదని, దీనితో మున్సిపల్ వీధిదీపాల నిర్వహణ కార్మికులతోనే ఆన్ ఆఫ్ చేయిస్తున్నారని, చెడిపోయిన లైట్లను మార్చడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. నిర్వహణ ఖర్చులు తీసుకుంటున్న ఏజెన్సీ సరిగా పనిచేయక పోయినా అధికారులు, పాలకవర్గం పట్టించుకోవడం లేదు. శ్రావణమాసం ఆరంభంతో వరుసగా పండుగల ఉన్న నేపథ్యంలో టవర్‌సర్కిల్‌లో చీకటి లేకుండా స్ట్రీట్ లైట్లను త్వరగా ఏర్పాటు చేయించాలని, చెడిపోయిన వీధి దీపాలను వెంట వెంటనే మార్చాలని, స్ట్రీట్ లైట్ల నిర్వహణను మెరుగు పరచాలని ప్రజలు కోరుతున్నారు.

'కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేయాలి'

హుజూరాబాద్, ఆగస్టు 4: హుజూరాబాద్ నియోజకవర్గంలోని లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను వెంటనే పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం హుజూరాబాద్‌లోని సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో అధికార, ప్రతిపక్షాల అధిపత్యం కోసం కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేయకుండా సంవత్సర కాలంగా కాలయాపన చేస్తున్నారన్నారు. ప్రొటోకాల్ పేరుతో లబ్ధిదారులను ఇబ్బంది పెట్టకుండా వెంటనే చెక్కులు పంపిణీ చేయాలని కోరారు. సమావేశంలో వెల్మరెడ్డి రాజిరెడ్డి, షైదంశెట్టి యుగంధర్, కుమారస్వామి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పు హర్షణీయం

సుభాష్‌నగర్, ఆగస్టు 4:ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు హర్షణీయమని మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కవ్వంపెల్లి రాములు అన్నారు. కరీంనగర్ కోర్టు చౌరస్తాలోగల అంబేద్కర్ విగ్రహం వద్ద మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో అలుపెరగని పోరాటం చేశామన్నారు. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణ అమలు చేయాలన్నారు. జనాభా దామాషా ప్రకారం మాదిగ ఉప కులాలకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఇప్పటికే ఇచ్చిన నోటిఫికేషన్లలో వర్గీకరణ అమలు చేయాలన్నారు. అందుకు అవసరమైతే కావలసిన ఆర్డినెన్స్ తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరా రు. మంద కృష్ణ మాదిగ కేవలం మాదిగలకే పరిమితం కాదని, అట్టడుగు వర్గాల నాయకుడన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ మాట్లాడుతూ సుప్రీం ఇచ్చిన తీర్పుతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఇచ్చిన రిజర్వేషన్ ఫలాలకు సార్థకత దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సెంకే సత్యనారాయణ, తాండ్ర నర్సన్న, వడ్లూరి రాజమల్లు, దండు అంజయ్య, చెంచాల నవీన్, కనకం అంజిబాబు, ఆసంపెల్లి భూమయ్య, తుంగ ఆంజనేయులు, కొత్తూరి రాజన్న, చిలుముల లక్ష్మణ్, చుంచు లక్ష్మణ్, గోష్కి శంకర్, గడ్డం కొమురమ్మ, దండు వరలక్ష్మి పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద నాయకుల సంబరాలు

కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ

భగత్‌నగర్, ఆగస్టు 4: కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఏఐకేఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా సర్వ సభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులు సాగు చేసే భూములను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. కేంద్ర పాలకులు బడ్జెట్‌లో వ్యవసాయ అభివృద్ధికి పెట్టుబడులు పెడతామని చెప్పడం సిగ్గు చేటన్నారు. నకిలీ విత్తనాలు అమ్ముతున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవడంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తు న్నారన్నారు. ఢిల్లీలో రైతుల దీక్షకు మోదీ ప్రభుత్వం దిగివచ్చి నల్ల చట్టాలను వెనక్కి తీసుకుందన్నారు. రుణమాఫీ కాని రైతులు ఏవోలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 6, 7 తేదీల్లో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ శిబిరాలు హైదరాబాద్‌లో జరుగనున్నాయన్నారు. సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్య క్షుడు కంజర భూమయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పొనగంటి కేదారి, రైతు సంఘం నాయకులు కాంతాల శ్రీనివాస్‌రెడ్డి, కంది రవీందర్ రెడ్డి, పైడిపల్లి రాజు, కాంతాల తిరుపతిరెడ్డి, గడ్డం రాంరెడ్డి, ముత్యాల శ్రీనివాస్‌రెడ్డి, బందెల శ్రీనివాస్, రవి, మధూకర్, బుచ్చయ్య, తిరుపతి, లక్ష్మారెడ్డి, బాపురెడ్డి పాల్గొన్నారు.

జిల్లా కమిటీ ఎన్నిక

ఏఐకేఎస్ జిల్లా కమిటీని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా కాంతాల శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కంది రవీం దర్‌రెడ్డి ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా పొనగంటి కేదారి, ఉపాధ్యక్షులుగా ఉమ్మెంతల రవీందర్‌రెడ్డి, ముత్యాల శ్రీనివాస్‌రెడ్డి, సహాయ కార్యదర్శులుగా గడ్డంరాంరెడ్డి, బుచ్చయ్య, కోశాధికారిగా కాంతాల తిరుపతిరెడ్డి, 17 మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.



కేదారి, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి

500 మంది విద్యార్థులు.. రెండు బస్సులు

- మోడల్ స్కూల్ విద్యార్థులకు ఇబ్బందులు
- 16 గ్రామాల నుంచి విద్యార్థుల రాకపోకలు



కాలినడకన వస్తున్న విద్యార్థులు

చొప్పదండి, ఆగస్టు 4: మండలంలోని రుక్మాపూర్ మోడల్ స్కూల్ విద్యార్థులు బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పాఠశాలలో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు 780 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి దాదాపు 500 మంది విద్యార్థులు ఆర్టీసీ బస్‌లు, ఆటోల ద్వారా పాఠశాలకు వచ్చి పోతుంటారు. కాట్నపల్లి, గుమ్లాపూర్, చొప్పదండి మీదుగా రాగంపేట వరకు ఒక బస్, చాకుంట, చొప్పదండి, భూపాలపట్నం, వెదురుగట్టు వరకు మరో బస్ విద్యార్థులను చేరవేస్తుంటాయి. పాఠశాలకు సమీపంలో ఉన్న గ్రామాల విద్యార్థులు వాహనాలపై స్కూల్‌కు వస్తారు. అనేక మంది విద్యార్థులు బస్‌ల పైనే ఆధారపడతారు. ఉన్న రెండు బస్‌లలో చోటు దొరకక చాలా ఇబ్బందులు పడుతున్నారు. రుక్మాపూర్ గ్రామానికి చెందిన అనేక మంది విద్యార్థులు బస్‌లో చోటు దొరకక రానుపోను నాలుగు కిలో మీటర్లు కాలినడకన వెళ్లి చదువుకుంటున్నారు. చొప్పదండితోపాటు పలు గ్రామాల నుంచి పదుల సంఖ్యలో ఆటోల్లో విద్యార్థులు వస్తున్నారు. మరో రెండు బస్సులను పెంచాల్సిన అవసరం ఉందని విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు ఆర్టీసీ అధికారులను కోరుతున్నారు.



బస్‌లో స్థలం లేక కింద ఉన్న విద్యార్థులు








రాణాకు చేరిన చిట్టీల పంచాయితీ

మల్లాపూర్, ఆగస్టు 4: మండలంలో జోరుగా జరుగుతు న్న జీరో చిట్టీల దందా చిలికిచిలికి గాలి వానగా మారి పోలీసుస్టేషన్‌కు చేరింది. మండలం లోని మొగిలిపేటలో జరుగుతున్న చిట్టీలతో మోసపోయామని నిర్వహకుడు ఆకుల గంగాధర్‌పై బాధితుడు సంగం పెద్దగంగారాం పోలీసుస్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఆకుల గంగాధర్ రూ. 5లక్షలు, రూ. 6లక్షలు, ఐదు తులాల బంగారం చిట్టీల వ్యాపారం చేస్తున్నాడు. దీంతో చిట్టీలు కట్టమని సంప్రదించగా రూ. 5, రూ. 6 లక్షల చిట్టీలు కట్టడంతో పాటు కుతూరు ముక్కెర లక్ష్మితో ఐదు తులాల బంగారం చిట్టీలను నాలుగు సంవత్సరాల నుంచి కట్టుకుంటు వస్తున్నామన్నాడు. కట్టిన చిట్టి డబ్బులు ఇవ్వమని ఆకుల గంగాధర్‌ను గతనెల నుంచి అడుగుతు న్నా పట్టించుకోకుండా దాటవేశాడు. దీంతో గ్రామంలోని పెద్దమనిషి వద్దకు పిలిచి అడగా మీరే డబ్బులు నాకు ఇంకా ఇవ్వాల్సి ఉందని బెదరింపులకు పాల్పడ్డాడు. కట్టిన చిట్టిన డబ్బులు ఇవ్వక బెదరింపులకు పాల్పడుతున్న ఆకుల గంగాదర్‌పై చర్యలు తీసుకోని న్యాయం చేయాలని పోలీసుల స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు.





కుక్కల దాడిలో ఒకరికి తీవ్ర గాయాలు


ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 4: ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామ శివారులోని డంపింగ్ యార్డు వద్ద రాగట్లపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి మందాటి మల్లేశంపై ఆదివారం కుక్కలు దాడి చేశాయి. తీవ్ర గాయాల పాలైన మల్లేశంను మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మల్లేశం రహదారి వెంట వస్తున్న క్రమంలో గుంపులుగా ఉన్న కుక్కలు ఒక్కసారిగా మీద పడి దాడికి దిగాయి. గ్రామంలో కుక్కల బెడద అధికంగా ఉందని స్థానికులు పేర్కొన్నారు. ప్రజలపై దాడి చేస్తున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల బారి నుంచి తమను రక్షించాలని కోరుతున్నారు.

ఆర్టీసీ బస్సు- ద్విచక్రవాహనం ఢీ

- ఒకరికి తీవ్రగాయాలు

మంథని ఆగస్టు 4: ఆర్టీసీ బస్సును ద్విచక్రవాహనం ఢీ కొన్న సంఘటన ఆదివారం మంథని మున్సిపాల్ పరిధీలోని గంగపురి వద్ద చోటు చేసుకుంది. మంథని డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు(టీఎస్08జెడ్0086) మంథని నుంచి హైదరాబాదుకు వెళ్లే క్రమంలో గంగపురి మూలమలుపు వద్ద ప్రమాదం సంభవించింది. ముత్తారం నుంచి మంథనికి వస్తున్న ద్విచక్రవాహనం వేగంగా ఆర్టీసీ బస్సుకు తగలడంతో ద్విచక్ర వాహనం కింద పడింది. ద్విచక్రవాహ నం వెనుకాల కూర్చున్న వ్యక్తి దండు పోచయ్యకు ప్రమాదంలో కాలు విరిగింది. గాయపడిన వ్యక్తిని మంథని ఆసుపత్రికి తరలించగా వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకోని విచారణ చేస్తున్నట్లు తెలిపారు.





తాగడానికి డబ్బులు లేక మద్యం షాపుల్లో చోరీలు

- నిందితుడిని పట్టుకున్న సుల్తానాబాద్ పోలీసులు

సుల్తానాబాద్, ఆగస్టు 4: మద్యానికి బానిసగా మారిన ఓ వ్యక్తి మద్యం కొనుగోలుకు డబ్బులు లేక తురుచుగా మద్యం దుకాణాల్లోనే దొంగతనాలకు పాల్పడుతున్నాడు. నిందితుడిని పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. సుల్తానాబాద్ ఎస్ఐ శ్రావణ్‌కుమార్ వివరాలు వెల్లడించారు. తాము సుల్తానాబాద్ పట్టణంలోని పూసాల చౌరస్తాలో వాహనాలు తనిఖీ చేస్తుండగా సిద్దిపేట పోలీస్ కమీషనరేట్ పరిధిలోని సిద్దిపేట మండలం రాఘవపూర్ గ్రామానికి చెందిన మడిగుడ్ల విజయ్‌కుమార్ (40)అనే వ్యక్తి ˇ పట్టుబడ్డారని తెలిపారు. ఇతన్ని విచారించగా దొంగతనాలను వృత్తిగా చేసుకు ని విందులు వినోదాలు జల్సాలు చేసుకుంటున్న వ్యక్తిగా నిర్ధారణ చేశామన్నారు. నాలుగు రోజుల క్రితం సుల్తానాబాద్ పట్టణంలోని పల్లవి బార్‌లో కూడా దొంగతనం చేశాడని, బార్ యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు. విజయ్ కుమార్ మొదటి సారిగా సుల్తానాబాద్ ప్రాంతానికి వచ్చి రాజీవ్ రహదారి సమీపంలోని ఈ బార్‌ను ఎంచుకుని అతిగా మద్యం సేవించి బార్ గోడ దూకి దొంగతనానికి పాల్పడ్డాడని వివరించారు.

● **వివిధ జిల్లాల్లో ముప్పై కేసులు..**

మద్యానికి బానిసగా మారిన విజయ్‌కుమార్ మద్యం కోసం, జల్సాల కోసం చోరీలకు పాల్పడే వాడని ఇలా రంగారెడ్డి, సిద్దిపేట, జీడిమెట్ల, కొత్తగూడెం, రాయదుర్గం, వనస్థలిపురం, మహబూబాబాద్, సంగారెడ్డితో పాటు పలు జిల్లాలో ముప్పై కేసులు నమోదై ఉన్నాయని ఎస్ఐ శ్రావణ్ కుమార్ వివరించారు. నిందితుడిని అదివారం సుల్తానాబాద్‌లో అరెస్టు చేసి అతని వద్ద నుంచి పది వేల రూపాయల నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు తెలిపారు.









అధ్వానంగా రహదారులు

● వర్షాలకు మరింత ప్రమాదకరంగా రోడ్లు
● ఇక్కట్లు పడుతున్న ప్రజలు
● పట్టని ప్రజాప్రతినిధులు, అధికారులు


అధ్వానంగా రాంపూర్- రామన్నపేట మార్గం


ముత్యంపేట వరదకాలువ బ్రిడ్జిపై ప్రమాదకరంగా గుంతలు


గుంతలతో ముత్యంపేట నుంచి బ్లాక్ చౌరస్తాకు వెళ్లే మార్గం

మల్యాల, ఆగస్టు 4: మండల వ్యాప్తంగా గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. మరమ్మతులు లేకపోవడం, కొత్తగా పనులు చేపట్టకపోవడంతో ప్రయాణానికి ప్రజలు, ప్రయాణీకులు తీవ్ర అసౌకర్యానికి గురి అవుతున్నారు. ఈ రహదారులపై తరచూ ప్రమాదాల భారిన పడుతున్నారు. ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదు. లోతైన గుంతలు, దారి అంతా కాలువలను తలపించేలా నీటి నిలువలు ప్రమాదకరంగా మారుతున్నాయి. దీనికి తోడు ఇటీవల కురుస్తున్న వర్షాలకు అనేక గ్రామీణ రహదారులు దెబ్బతిన్నాయి. మండలంలోని దాదాపుగా అన్ని గ్రామాల్లో రహదారులు కోతలకు గురి కాగ కొన్ని చోట్ల వర్షపు నీటికి కొట్టుకుపోయాయి. తారు లేచి రాకపోకలకు ప్రమాదకరంగా మారాయి. రామన్నపేట- రాంపూర్- జగిత్యాల వెళ్లె రహదారికిరువైపుల కోతలకు గురి అయి లోతైన గోతులు ఏర్పడ్డాయి. అలాగే రాంపూర్ నుంచి రామన్నపేటకు వచ్చే మార్గం గుంతలమయమై బురద రోడ్డుగా మారింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అలాగే గొర్రెగుండం వెళ్లె మార్గంలో తారు లేచి, గోతులు ఏర్పడ్డాయి. ఇదే మార్గం నుంచి మండంలోని ఓగులాపూర్‌తో పాటు కొడిమ్యాల మండలానికి నిత్యం రాకపోకలు కొనసాగుతుంటాయి. రహదారి అధ్వన్నంగా మారడంతే ప్రయాణానికి పాట్లు పడాల్సి వస్తుంది. మండలంలో సగానికి పైగా గ్రామాల్లోని రహదారులు దెబ్బతినడంతో ప్రజలు, ప్రయాణీకులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు తగుచర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు

● కాలువలను తలపిస్తున్న రహదారులు

మండలంలోని వరదకాలువ ప్రాంత గ్రామాల పరిధిలో రహదారులు కాలువలను తలపిస్తున్నాయి. వరదకాలువతో ఒర్రెలు ఉనికి కోల్పోగా వాటి ద్వారా వచ్చే నీరు రహదారులపై ప్రవహిస్తున్నాయి. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. వరదకాలువ వంతెనలపై మరమ్మత్తులు లేకపోవడంతో బ్రిడ్జిలకు ప్రమాదం పొంచి ఉంది. తగు చర్యలను తీసుకోవాలని వరదకాలువ ప్రాంత ప్రజలు, ప్రయాణీకులు అధికారులను కోరుతున్నారు.

కొనసాగుతున్న ఎత్తిపోతలు

రామడుగు/బోయినపల్లి, ఆగస్టు 4: మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి మిడ్ మానేరు జలశయానికి ఎత్తిపోతలు కొనసాగుతున్నా యి. ఆదివారం నాలుగు పంపుల ద్వారా 12,600 క్యూసెక్కుల నీరు వరద కాలువ ద్వారా మిడ్ మానేరు డ్యాంలోకి తరలివె ళుతోంది. మిడ్ మానేరు ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 27.50 టీఎంసీలకు ప్రస్తుతం 15.507 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

● ఎస్సారెస్పీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

జగిత్యాల: శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి 18,291 క్యూసెక్కుల నీరు వస్తోంది. ప్రస్తుతం డ్యామ్‌లో 44.266 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

రాజన్న ఆలయంలో నేటినుంచి బ్రేక్ దర్శనం

వేములవాడ రూరల్, అగస్టు 4: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో సోమవారం నుంచి బ్రేక్ దర్శనం అమలు చేయనున్నట్లు ఆలయ ఈవో వినోద్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ రోజు ఉదయం 10-15 ని॥ల నుంచి 11-15 ని॥ల వరకు, సాయంత్రం 4-00 నుంచి 5-00 వరకు భక్తుల సౌకర్యార్థం బ్రేక్ దర్శనం ఉంటుందన్నారు. బ్రేక్ దర్శనం టికెట్ 300 రూపాయలుగా నిర్ణయించినట్లు తెలిపారు.

మత్స్యకారులకు చేపపిల్లలకు బదులు నగదు పంపిణీ చేయాలి

- సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ

జగిత్యాల అర్బన్, ఆగస్టు 4: మత్స్యకారులకు చేపపిల్లలకు బదులు నగదు పంపిణీ చేయాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని చెరువులు కుంటల విస్తీర్ణతను పరిగణలోకి తీసుకొని విత్తనాలకు సంబంధించిన చేప పిల్లలను రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు. అయితే చేపపిల్లల పంపిణీకి గత నెలలో టెండర్‌లు పిలవగా, సంబంధిత చేపపిల్లల కాంట్రాక్టర్‌లు కుమ్మక్కయ్యారని ఎవరూ టెండర్‌లో పాల్గోనకుండా చేయడం వల్ల కార్యక్రమం వాయిదా పడిందన్నారు. కావున చేపపిల్లల పంపిణీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం మత్స్యశాక తరుపున ప్రత్యక్షంగా చేపపిల్లల పంపిణీకి బదులు వాటి విలువకు అనుగుణంగా చెరువు విస్తీర్ణతను పరిగణలోకి తీసుకొని మత్స్యపారిశ్రామిక సంఘాలకు నేరుగా నగదు రూపకంగా గ్రాంట్ మంజూరు చేయాలని కోరారు. ఈ చర్యల వల్ల దళారీవ్యవస్థ జోక్యం నిలువరింపజేయవచ్చన్నారు. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. కాగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి రాసిన లేఖపై జిల్లా గంగపుత్ర సంఘ పక్షాన గుమ్ముల అంజయ్య జీవన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



వేములవాడ, సిరిసిల్లలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

వేములవాడ రూరల్, ఆగస్టు 4: ప్రజల సమస్యలను పరిష్కరించడానికి నిరంతరం పోరాటం చేస్తామని, గ్రామస్థాయిలో కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడలో టీకేఎంయూ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణ తరగతుల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 100 సంవత్సరాల చరిత్ర కలిగిన పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని, ఎన్నికల వేళ డబ్బు ప్రభావం పెరిగినా ప్రజలు ఇప్పటికీ ఎర్ర జెండా వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. ప్రజల సమస్యలపై పోరాటంలో కమ్యూనిస్టు పార్టీలు ముందుంటాయన్నారు. ప్రజల పక్షాన పోరాడడానికి పార్టీ చట్ట సభల్లో బలోపేతం కావాల్సిన అవసరముందన్నారు. పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయడానికి ప్రణాళికలతో ముందుకెళ్తామన్నారు. మతంపేరుతో పబ్బం గడుపుకునే పార్టీలకు త్వరలోనే కాలం చెల్లుతుందన్నారు. పార్లమెంట్‌లో సీట్లు తగ్గినప్పటికీ బీజేపీ నాయకులకు అహం తగ్గడం లేదన్నారు. కార్మిక వ్యతిరేక, ప్రజావ్యతిరేక చట్టాలను తీసుకువస్తున్న కేంద్రప్రభుత్వ వైఖరిని ఎండగడుతామని తెలిపారు. కార్యక్రమంలో జాతీయ కార్యవర్గ సభ్యుడు టి వెంకటరాములు, టీకెఎంయూ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కె. కాంతయ్య, ఎస్ బాలమల్లేశ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ కయ్యడ సృజన్‌కుమార్, తాటి వెంకటేశ్వర్లు, జంగయ్య, ఏసు, నాయకులు లింగారెడ్డి, మహాలక్ష్మి, కడారి రాములు పాల్గొన్నారు.

● వస్త్ర పరిశ్రమలను కాపాడాలి..

సిరిసిల్ల రూరల్: రాష్ట్ర అసెంబ్లీలో ఎమ్మెల్యేలు, మంత్రులు అమ్మలు, అక్కలంటూ తిట్టుకునే దుస్థితి వచ్చిందని, ప్రజా సమస్యలపై మాట్లాడకుండా ఒకరిని ఒకరు తిట్టుకోవడంపై అధికార, ప్రతిపక్షాలు దృష్టి పెట్లాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో వస్త్ర పరిశ్రమల అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు ఆదివారం సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వస్త్ర పరిశ్రమ సంక్షోభంతో కార్మికులు ఆత్మహత్య చేసుకుంటుంటే ప్రభుత్వం సమస్యను పరిష్కరించడం లేదన్నారు. ఉపాధి కల్పించకుండా రాజకీయ కక్ష సాధింపునకు నేతన్నలను బలిచేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం అనుసరించిన విధానాల ఫలితంగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ మొత్తం ప్రభుత్వంపైనే ఆధారపడాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ప్రభుత్వం మారిన వెంటనే గత ప్రభుత్వం కొనసాగించిన పథకాలను బంద్ చేసి కార్మికులకు ఉపాధిని దెబ్బతీయం ఎంతవరకు సమంజమన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో వస్త్ర పరిశ్రమలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని తాను మాట్లాడానని, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. సమస్యను పరిష్కరించాలని కోరినా స్పందన లేకుండా పోయిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్డర్లకు సంబంధించిన బకాయిలను ఇవ్వాలని కోరినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, పట్టణ కార్యదర్శి పంతం రవి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు, చేనేత వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్, పాలిస్టర్ అసోషియేషన్ అధ్యక్షుడు అడెపు భాస్కర్, సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్, జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, అసాములసమన్వయ కమిటి అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్, పోరండ్ల రమేష్, ఏనుగుల ఎల్లయ్య, అంకాలపు రవి, గాజుల నారాయణ, ఉడుత రవి, వెల్దండి శంకర్, గంగుల శ్రీనివాస్, వేముల దామోదర్, సిరిమల్ల సత్యం, కుమ్మరికుంట కిషన్, మండల బాలరాజు, బండారి అశోక్, దూడం రమేష్, గోవిందు రాజు తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

వీణవంక, ఆగస్టు 4: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలో విలేజ్ పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, రెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం ఉదయం టీఎస్02యూడీ4400 ఆటో ట్రాలీలో 24 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నారు. అట్టీ బియ్యం ఎక్కడి నుంచి తీసుకొని వెళ్తున్నారని, రవాణా చేయుటకు అనుమతి పత్రాలు ఉన్నాయానని ప్రశ్నించారు. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో విచారించగా, తెలంగాణ ప్రభుత్వం పేదలకు అందించే బియ్యాన్ని ఒక కిలోకి రూ. 12ల చొప్పున కొనుగోలు చేసి చింతకుంట, కరీంనగర్ పరిసర ప్రాంతాల్లోని కోళ్ల పారాలకు రూ. 17లకు అమ్ముకుంటూ ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నారన్నారు. ట్రాలీని, గంట వెంకటేష్, సిద్ధంకి భాస్కర్‌లను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిరుపతి పేర్కొన్నారు.

ఆటో, బైక్ ఢీ: ఒకరికి గాయాలు

శంకరపట్నం, ఆగస్టు 4: శంకరపట్నం మండలం చింతలపల్లి శివారులో ఆటో బైక్ ఢీ కొని ఒకరు గాయపడ్డ సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మానకొండూర్ మండలం కొండపలకల గ్రామానికి చెందిన కొత్తిరెడ్డి గణపతిరెడ్డి చింతలపల్లి గ్రామానికి వెళ్లి వస్తుండగా, చింతలపల్లి మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న ఆటో ఢీ కొనడంతో గణపతిరెడ్డి తలకు, కాలుకు తీవ్రమైన గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించగా, ప్రథమ చికిత్స అందిస్తూ కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

హుజూరాబాద్, ఆగస్టు 4: ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను ఆదివారం పట్టుకున్నట్లు టౌన్ సీఐ తిరుమల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం హుజూరాబాద్ మండలంలోని శాలపల్లి గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని ట్రాక్టర్ డ్రైవర్లు, ఓనర్లపై కేసు నమోదు చేశామన్నారు. అనంతరం టౌన్ సీఐ తిరుమల్ మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే వారిపైన చట్టరీత్య చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మాల మహానాడు సభను విజయవంతం చేయండి

కొడిమ్యాల, ఆగస్టు 4: డిల్లీలోని జంతర్‌మంత ర్‌లో ఈ నెల 7, 8, 9 తేదీల్లో నిర్వహించే మాల మహానాడు సభను విజయవంతం చేయాలని రాష్ట్ర మాల మహానాడు ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని అంగడి బజారులో ప్రజా గాయకుడు, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం మేడి అంజయ్య మాట్లాడుతూ మాలల సమస్యల పరిష్కారానికి నిర్వహించే సభకు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. అంతకుముందు హలో మాల చలో డిల్లీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ చెన్నల సుమన్, మండల అధ్యక్షుడు కాయితరాజు, కన్వీనర్ రావుల నర్సింగరావు, నాయకులు బండి చందు, రాకేష్, శేఖర్, అర్జున్, యుగందర్, శ్యాం తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాల సంఘం నాయకులు

వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు


లంబ రాములు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 4: ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామంలోని వ్యక్తి లంబ రాములు అదృశ్యంపై కేసు నమోదు చేశామని స్టేషన్ హౌజ్ అధికారి కిషన్‌రావు ఆదివారం తెలిపారు. రాములు గ్రామ శివారులోని డబుల్ బెడ్ రూం ఇళ్ల సమీపంలోని తన వ్యవసాయ పొలం వద్ద ఉన్న పాడిగేదెకు గడ్డి వేసి వస్తానని ఈ నెల 3న ఇంటిలో కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లాడని పేర్కొన్నారు. తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు చుట్టు పక్కల, బంధువుల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభించలేదని చెప్పారు. రాములు భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని స్టేషన్ హౌజ్ అధికారి కిషన్‌రావు వివరించారు.

ఉరి వేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

బోయినపల్లి, ఆగస్టు 4: బోయినపల్లి మండలంలోని కొదురుపాక గ్రామానికి చెందిన కడుదుల కొమురయ్య(70) అనే వృద్ధుడు అనారోగ్యంతో ఇబ్బంది పడి ఇంటిముందు ఉన్న మామిడి చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య కేతమ్మ ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఇద్దరు కొడుకులు గతంలోనే చనిపోయారు. అనారోగ్య సమస్యల వలన ఆత్మహత్య చేసుకున్నట్లు కొమురయ్య భార్య కేతమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై పృథ్విధర్ గౌడ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి


కటకం సత్యం(ఫైల్)

కరీంనగర్ క్రైం, ఆగస్టు 4: నగరంలోని పద్మనగర్ ప్రాంతంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఆదివారం మధ్యాహ్నం విద్యుదాఘాతానికి గురై కటకం సత్యం (48) అనే వర్కర్ మృతి చెందాడని కరీంనగర్ రెండో ఠాణా పోలీసులు తెలిపారు. పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం శాలపల్లికి చెందిన కటకం సత్యం రోజులాగే ఆదివారం 12:30 గంటల ప్రాంతంలో స్కూల్ మైదానంలోని రన్నింగ్ ట్రాక్‌ను జెట్ ప్రెషర్ పంప్‌తో శుభ్రం చేస్తుండగా ప్రమా దవశాత్తు విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. వెంటనే అక్కడే ఉన్న సూపర్‌వైజర్, కుక్‌లు గమనించి మోటార్ ప్లగ్ తొలగించారు. కిందపడిపోయిన సత్యంను కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మరణించాడని ధ్రువీకరించారు. మృతుడి భార్య సునీత ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపికలకు విశేష స్పందన


ఎంపిక పోటీలకు హాజరైన క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 4: జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా అండర్16 క్రికెట్ జట్టు ఎంపిక పోటీలకు విశేష స్పందన లభించింది. జిల్లా కేంద్రంలోని క్రికెట్ అసోసియేషన్ కార్యాలయం నెట్స్‌లో నిర్వహించిన ఈ పోటీలకు ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 142 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరికి నిర్వాహకులు బౌలింగ్, బ్యాటింగ్, ఫీల్డింగ్, కీపింగ్ అంశాలలో ప్రతిభను పరీక్షించి, ప్రతిభ చాటిన 18మంది క్రీడాకారులను ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికైన క్రికెట్ జట్టు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించినున్న అండర్-16 క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొననుంది. ఈ పోటీల నిర్వహణలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎన్ మురళీధర్‌రావు పాల్గొని పర్యవేక్షించారు. జిల్లా సంఘ ఉపాధ్యక్షుడు కె మహేందర్‌గౌడ్, పి మనోహర్‌రావు, ఈసీ అజిత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ అమలు

- టీఆర్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కటుకం రమేష్

జగిత్యాల అర్బన్, ఆగస్టు 4: పదేళ్లుగా ప్రమోషన్‌లు, బదిలీల కల సాకారం చేసి వందలాది కోర్టు కేసుల ద్వారా నమ్మకం కోల్పోయిన వేలాది మంది ఉపాధ్యాయులకు పదోన్నతుల కల సాకారం చేసిన ప్రభుత్వం, తమ సర్వీస్ రూల్స్‌ను సైతం తప్పక అమలు చేస్తుందనే విశ్వాసం తమకుందని టీఆర్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కటుకం రమేష్, ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక దేవిశ్రీ గార్డెన్‌లో టీఆర్టీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి మార్గాలను అన్వేషిస్తూ అపరిష్కృత సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవచూపుతోందన్నారు. జీవో నంబర్ 11, 12ను సవరించి బీఈడీ పూర్తి చేసిన ఉపాధ్యా యులకు పీఎస్ హెచ్‌ఎంల పదోన్నతికి అర్హత కల్పించేందుకు ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించిందని తెలిపారు. త్వరలోనే పీఎస్ హెచ్‌ఎంల పోస్టులు మంజూరు చేస్తూ వాటిలో ఎస్జీటీ ఉపాధ్యాయుల అందరికీ పదోన్నతి అవకాశం కల్పించబడుతుందని వివరించారు. ఆ విధంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలిపారు. జీవో నంబర్ 317 ఉత్తర్వుల మేరకు నష్టపోయిన ఉపాధ్యాయులందరికీ స్థానిక జిల్లాలో బదిలీల కొరకు రాష్ట్ర సంఘ పక్షాన కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ బాధ్యులు తుంగూరి సురేష్, గుర్రం శ్రీనివాస్ గౌడ్, గోవర్ధన్, విజయానందరావు. చిన్నయ్య, సాయికృష్ణ, రణధీర్, అంబాజీ నాయక్, భీమయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కటుకం రమేష్

మొక్కలు పెంచడం సామాజిక బాధ్యత



మాట్లాడుతున్న డీఎఫ్‌వో బాలమణి

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 4: మొక్కలు పెంచడం సామాజిక బాధ్యత అని కరీంనగర్ డీఎఫ్ఓ బాలమణి అన్నారు. ప్రముఖ ఆయుర్వేద శిరోమణి పతంజలి అధినేత ఆచార్య బాలకృష్ణ జన్మదిన సందర్భంగా భారత్ స్వాభిమాన్ ట్రస్ట్, పతనియోగ సమితి, యువభారత్ ఆధ్వర్యంలో స్థానిక గీతా భవన్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన మొక్కల పంపిణీ కార్యక్రమానికి డీఎఫ్ఓ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాల సమయంలో ప్రతి వ్యక్తి విరివిగా మొక్కలు నాటాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యువభారత్ జిల్లా ఉపాధ్యక్షులు గడ్డం మధు, భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ బాధ్యులు మనోజ్ ముందాడ, ఆలేటి శ్రీనివాస్, శ్రవణ్ కుమార్, కేఇఎస్ శేఖర్, విజయ, నాగమణి, పతంజలి యోగ సమితి అధ్యక్షులు బి లక్ష్మీనారాయణ, పతంజలి బాధ్యులు నాగమల్ల శ్రీనివాస్, పరుశురాం, రామచంద్రారెడ్డి, ఎం శ్రీనివాస్, ఎఫ్‌బిఓ అజామొద్దీన్‌లతో పాటు అధిక సంఖ్యలో యోగ సాధకులు పాల్గొన్నారు.

ఏఐసీసీ మైనార్టీసెల్ చైర్మన్‌ను కలిసిన జిల్లా నాయకులు

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 4: కాంగ్రెస్‌పార్టీ జాతీయ మైనార్టీ విభాగం చైర్మన్, రాజ్యసభ సభ్యులు ఇమ్రాన్ ప్రతాప్‌గరిని కాంగ్రెస్‌పార్టీ మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ ఎండీ తాజొద్దీన్ ఆధ్వర్యంలో ఆదివారం అయనను మర్యాదపూర్వకంగా కలిశారు. కొత్త ఢిల్లిలో అక్బర్‌రోడ్‌లోని ఏఐసీసీ కార్యాలయంలో ఆయనను కలిసి ఒక వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెల్ చైర్మన్ మొహమ్మద్ తాజుద్దీన్‌తోపాటు తెలంపెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ మైనారిటీ సెల్ చైర్మన్ ఎస్‌కే అక్బర్ అలీ, జగిత్యాల జిల్లా చైర్మన్ సిరాజ్ మన్సూర్, సైపుల్లా ఖలీద్, సిరాజ్ అజీజ్ మహెమొద్‌ఖాన్, సలీం, జఫర్ షరీఫ్, ఫయాజ్, హుస్సేన్‌లు కలిశారు.

తెలుగు యూనివర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరు తొలగించొద్దు

కరీంనగర్ టౌన్, ఆగస్టు 4: తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును తొలగించే ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని పొట్టి శ్రీరాములు ఫౌండేషన్ డిమాండ్ చేసింది. ఈమేరకు ఆదివారం నగరంలోని క్లాక్ టవర్ వద్ద అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహ వ్యవస్థాపకుడు ఉప్పల రామేశం ఆధ్వర్యంలో పలువురు వైశ్యులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో శ్రీ గీతా భక్త సమాజం అధ్యక్షుడు బండ సత్తయ్య, సభ్యులు కాచం సుదర్శనం, శంకరయ్య, భూపతి, కైలాసం, శ్రీశైలం, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

●ఇల్లందకుంట, ఆగస్టు 4: తెలుగు విశ్వవిద్యాలయానికి అమరజీవి పొట్టి శ్రీరాములు పేరును తొలగించవద్దని ఆర్యవైశ్య మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు చిదురాల నగేష్‌గు ప్తా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు మాట్లాడే ప్రజల కోసం, తెలుగు భాష కోసం తెలుగు ప్రజలంతా కలిసి ఉండాలని తన ప్రాణాన్ని త్యాగం చేసిన మహానీ యుడు పొట్టి శ్రీరాములు అన్నారు.

ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లపై నిరసన

సుభాష్‌నగర్, ఆగస్టు 4: ఎస్సీ , ఎస్టీల రిజర్వేషన్లపై ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు నిరసనగా వ్యక్తం చేశారు. ఆదివారంస్థానిక కార్ఖానగడ్డ లోని బాబాసాహెబ్ డా.బి.ఆర్.అంబేద్కర్ మెమోరియల్ క్లబ్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షులు భైరం కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడుతూ రాజ్యాంగ విరుద్ధంగా సుప్రీం కోర్టు తీసుకున్న ఈ నిర్ణయంతో భవిష్యత్తులో తీరని అన్యాయం జరుగుతుందని అన్నారు.

ఆర్టికల్ 341 ప్రకారం రాజ్యాంగ విరుద్ధంగా ఉన్న సుప్రీం కోర్టు నిర్ణయాన్ని పుణ సమీక్షించాలని కోరారు. ఈ సమావేశంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి మాదేపు హరిబాబు, ఉపాధ్యక్షులు గొర్రె వాసు, సలహాదారులు కనమళ్ళ శ్రీనివాస్, సభ్యులు మాదేపు నర్సయ్య, కారు నాగేశ్వర్ రావు, జెల్ల కాంతయ్య, నిజాంపేట్ శ్రీనివాస్, పిట్టల కృష్ణ, పిట్టల రేణు కుమార్, జెల్ల గోవర్ధన్, పెదరంగం సరిన్, మెండి శరత్‌కుమార్, మేకల లక్ష్మీనారాయణ, గోలిపల్లి నాగరాజు,కొరివి అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో ఫ్యాక్టర్ స్క్రీనింగ్ ఫీబా టెస్ట్

సుభాష్‌నగర్, ఆగస్టు 4: కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివారం పెద్దపల్లి హేమోఫిలియా చాప్టర్ టీఏకెతఈడీఏ వారి సహకారంతో హేమోఫిలియా వ్యాధిగ్రస్థులకి ఫ్యాక్టర్, ఫ్యాక్టర్ ఎఫ్ఈబీబీఏఏ స్క్రీనింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసు పత్రి ఆర్ఎంవో డాక్టర్ నవీన మాట్లాడుతూ ఆసుపత్రిలో వైద్యం చెయ్యడానికి, ఫ్యాక్టర్ ఇంజక్షన్స్ ఎల్లవేళలా అందుబాటులో ఉంటాయన్నారు. ఈ టెస్ట్‌ల వల్ల పేషంట్ ఫ్యాక్టర్ లెవల్ తెలుస్తుందన్నారు. దాంతో వైద్యం చెయ్యడం కూడా సులువుగా చెయ్యవచ్చు అన్నారు.ఈ టెస్ట్‌ను కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, సిద్దిపేట మంచిర్యాలకు చెందిన హేమోఫిలియా వ్యాధిగ్రస్తులు ఉపయోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈర్ల శ్రీనివాస్ చాప్టర్ సభ్యులు హరీష్, మహేష్, రాంప్రసాద్, రమేష్ మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు శ్యాంసుందర్ మృతి తీరని లోటు

హుజూరాబాద్, ఆగస్టు 4: హుజూరాబాద్ ప్రాంతానికి చెందిన సీనియర్ జర్నలిస్టు బాణాల శ్యాంసుందర్ గుండెపోటుతో మృతి చెందడం తీరణి లోటని టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా కన్వీనర్ నగునూరి శేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే (ఐజేయూ) తరుపున వారికి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియడంతో పాటు రూ. 10వేల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఈ డబ్బులను మృతుడి కుమారుడికి హుజూరాబాద్, జమ్మికుంట సీనియర్ పాత్రికేయులు మామిడి రవీందర్‌గౌడ్, కోరం సుధాకర్‌రెడ్డి, గడ్డం ధర్మారెడ్డి, నర్సిని శ్రీనివాస్, కాయిత రాములు, వేల్పుల సునీల్, పోతరాజు సంపత్, కుడికాల సాయి అందజేశారు. అనంతరం శ్యాంసుందర్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, బార్ అసోసియేషన్ న్యాయవాదులు, వివిధ పార్టీల నాయకులు నివాళులర్పించారు.

● ఎమ్మెల్యే కవ్వంపల్లి దిగ్భ్రాంతి..

శంకరపట్నం/కరీంనగర్ అర్బన్: సీనియర్ పాత్రికేయుడు, న్యాయవాది బాణాల శ్యాంసుందర్ ఆదివారం హఠాన్మరణం చెందడం దిగ్భ్రాంతికి గురిచేసిందని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విలువలు, నిబద్ధతకు శ్యాంసుందర్ మారుపేరని కొనియాడారు. శంకరపట్నం, సైదాపూర్, హుజూరాబాద్‌లలో వివిధ పత్రికల్లో పనిచేసిన శ్యాంసుందర్ ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు, అధికారులతో సత్సంబంధాలు కొనసాగించారని, అందరితో మంచివాడుగా గుర్తింపు పొందారని అయన పేర్కొన్నారు. శ్యాంసుందర్ మృతికి ఆయన తీవ్ర సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

శంకరపట్నం: న్యాయవాది, పాత్రికేయుడు, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ నాయకుడు బాణాల శ్యాంసుందర్ గుండెపోటుతో ఆదివారం అకాల మరణం చెందడం బాధాకరమని రైతు, ప్రజా సంఘాల జాతీయ నాయకుడు పొలాడి రామారావు విచారం వ్యక్తం చేస్తూ నివాళులర్పించారు. ఆదివారం హుజూరాబాద్‌లో మృతుడి కుటుంబ సభ్యులను రామారావు కలిసి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

గోపాలరావుపేటలో డైరెక్టర్ బోయపాటి శ్రీను పూజలు

రామడుగు, ఆగస్టు 4: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలోని శివాలయంలో ప్రముఖ సినీ డైరెక్టర్ బోయపాటి శ్రీను ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయానికి వచ్చిన బోయపాటి శ్రీనుకు పూజారులు నూనె మహేశ్వరశర్మ, రవికిరణ్ స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. కాగా గ్రామానికి వచ్చిన బోయపాటి శ్రీనుకు జాతీయ యువజన అవార్డు గ్రహీత అలువాల విష్ణు చేనేత వస్త్రంతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కిరణ్‌కుమార్, మహేశ్వర్, గ్రామ యువకులు కొలిపాక కమలాకర్, గుండి రాజేశ్వర్, కొలిపాక మల్లేశం, ప్రవీణ్, చందు, మనోజ్, సంపత్ ఉన్నారు.



డైరెక్టర్ బోయపాటి శ్రీనును సన్మానిస్తున్న యువకులు

కరాటేతో ఆత్మవిశ్వాసం పెంపు



పోటీలను ప్రారంభిస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 4: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, కరాటే వంటి వాటిలో శిక్షణ పొంది ఆత్మస్థైర్యం పెంపొందించుకోవాలని మేయర్ యాదగిరి సునీల్‌రావు పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని రాజశ్రీగార్డెన్స్‌లో అట్టహాసంగా గౌరు నారాయణరెడ్డి మెమోరియల్ జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభ మయ్యాయి. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా మేయర్ యాదగిరి సునీల్‌రావు హాజరై జ్యోతి ప్రజ్వళన చేసిన స్టార్ట్‌చెప్పి పోటీలను ప్రారంభించారు. జానపద కళాకారులు, స్వాతంత్ర్య సమర యోధుడు గౌరు నారాయణరెడ్డి మెమోరియల్ పేరుతో జాతీయ కరాటే పోటీలను కరీంనగర్‌లో ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. మార్షల్ ఆర్ట్స్‌తో విద్యార్థులు శారీరకంగా, మానసికంగా, ధృడంగా ఉంటారని అన్నారు. గౌరు నారాయణరెడ్డి కుమారుడు గౌరు రాజిరెడ్డి దశాబ్దకాలంగా స్థానిక ప్రభుత్వ ధన్గర్‌వాడీ పాఠశాలలో ఉచితంగా కరాటే శిక్షణ ఇవ్వడం హర్షణీయమని అన్నారు. బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ మాట్లాడుతూ క్రీడలకు కరీంనగర్ కేంద్రంగా మారుతుందని, ప్రతి సంవత్సరం రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయస్థాయి క్రీడా పోటీలు ఇక్కడ నిర్వహించడమే ఇందుకు నిదర్శనమని చెప్పారు. విద్యార్థులు శారీరక ధృడంగా ఉన్నపుడే ఏదైనా సాధించే సత్తా ఉంటుందని చెప్పారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని వారు పోటీలను తిలకించారు. దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన 900 మంది కరాటే క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొని కటా, కుమిటి, టీం కటా, వెపన్ కటా విభాగాల్లో పోటీపడనున్నారు. అలాగే కుమిటి విభాగంలో గ్రాండ్ ఛాంపియన్ షిప్‌కు కూడా పోటీలను నిర్వహించి విజేతకు ట్రోఫీతో పాటు నగదు పారి తోషకాన్ని అందిస్తామని పోటీల నిర్వా హకుడు గౌరు రాజిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒలంపిక్ అసోసి యేషన్ ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్ధన్ రెడ్డి, వి.రవీందర్ కుమార్, రాష్ట్ర కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు ఇ.శ్రీనివాస్, వి.నరేందర్, ప్రతినిధులు కె.వసంత్ కుమార్, నాయుడు, గణేశ్, సాయికుమార్, పి.వెంక టేశం, ఎం.సదానందం, ఇ.పాపయ్య, మోండయ్య, సురభి వేణుగోపాల్, జిల్లా ప్రతినిధులు మన్నన్, సంపత్, ఆర్.ప్రసన్నకృష్ణ, తోడూరి శేఖర్, పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

సినారె పురస్కారానికి జిల్లా వాసుల ఎంపిక

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 4: హైదరాబాద్‌కు చెందిన మహాకవి సినారె సాహిత్య కళాపీఠం అందజేస్తున్న సినారె సాహిత్య పురస్కారానికి ఉమ్మడి జిల్లాకు చెందిన కవులు సంగెవేని రవీంద్ర, బూర్ల వేంకటేశ్వర్లు ఎంపికయ్యారు. కళాపీఠం అధ్యక్షుడు మల్లెకేడి రాములు, సమన్వయ కర్త పోరెడ్డి రంగయ్య ఒక ప్రకటనలో విడుదల చేశారు. ఈ నెల 10న హైదరాబాద్‌లోని ఏబిఆర్ ఏసి కన్వెన్షనల్‌లో ఉదయం 10 గంటలకు పురస్కార ప్రదానం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా పురస్కార గ్రహీతలను పలు సాహితీ సంస్థల బాధ్యులు అభినందనలు తెలిపారు.

రెనే హాస్పిటల్ లో ఉచిత వైద్య శిబిరం

సుభాష్‌నగర్, ఆగస్టు 4: నేషనల్ బోన్ అండ్ జాయింట్స్ డే ను పురస్కరించుకొని ఆదివారం స్థానిక రెనే హాస్పిటల్ చైర్మెన్ డాక్టర్ బంగారి స్వామి ఆధ్వర్యంలో ఉచిత ఆర్థోపెడిక్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఉచిత కన్సల్టేషన్ తోపాటు ఉచిత ఎక్స్‌రే పరీక్షలు చేయడం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బంగారి స్వామి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి తద్వారా అర్హులైన పేదలకు ఉచితంగా సర్జరీలు నిర్వహిస్తామని తెలిపారు. రాబోయే రోజుల్లో ఇంకా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిం చడానికి రెనే హాస్పిటల్ ఎప్పుడు సిద్ధంగా ఉంటుందని అన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరం లో సుమారు తీతీౌ మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రెనే ఆర్థోపెడిక్ డిపార్ట్మెంట్ వైద్యులు డా.నవ్య, డా.వేద విహార్, క్యాంప్ కోఆర్డినేటర్ మొహమ్మద్ మోసిన్ , హాస్పిటల్ జనరల్ మేనేజర్ అరవింద్ రావు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు

సుప్రీంతీర్పుపై ఎరుకల సంఘాల హర్షం

సుభాష్‌నగర్, ఆగస్టు 4: ఎస్సీ, ఎస్టీ కులాలకు ఏబిసిడి వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం ఇస్తూ, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఒలగుత్తుల పోచయ్య అన్నారు. ఆదివారం నగరంలోని ఆదివాసి కుర్రు ఉద్యోగుల సంఘం కరీంనగర్ సంఘ కార్యాలయంలోఎరుకల హక్కుల పోరాట సమితి, ఎరుకల సంఘం, తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘ్, అధ్వర్యంలో సమవేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మానుపాటి రాజయ్య మాట్లాడుతూ ఎరుకల ప్రజలు ఉద్యోగానికి. విద్యకు ఆర్థికంగా. దూరంగా ఉండి బతుకుతున్న సందర్భంగా వర్గీకరణ ఎస్సీ ,ఎస్టీ కులాల్లో జరుగుతే ఎరుకల కులానికి సరైన న్యాయం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఎరుకల హక్కుల పోరాట సమితి మొగిలి శ్రీనివాస్, ఎరుకల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు, మానుపాటి రవి, ఎరుకల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కుతాడి శ్రీనివాస్. ఆదివాసి కుర్రు ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బిజిలి శ్రీనివాస్, తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘ్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు శివరాజ్ తదితరులు పాల్గొన్నారు

లో వోల్టేజీ సమస్య పరిష్కారానికి ముందస్తు చర్యలు



బ్యాంక్‌కాలనీలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

గణేశ్‌నగర్, ఆగస్టు 4: జిల్లా కేంద్రంలో వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకొని లో వోల్టేజీ సమస్యను పరిష్కరించేందుకు ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండి కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎస్ఈ గంగాధర్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని టౌన్‌త్రీ బ్యాంక్ కాలనీలో రెండు 100 కెవి న్యూ ట్రాన్స్‌ఫార్మర్లు చార్జ్ చేసి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డీఈ జంపాల రాజు, ఏడీఈ సాయినేని నరేందర్, ఏఈ దేవసాని సంపత్ కుమార్, నర్సింహారెడ్డి, లైన్ ఇన్‌స్పెక్టర్, సూరయ్య లైన్ ఇన్స్పెక్టర్, సంపత్ ఫోర్ మెన్, అజ్మీరా అజ్మీరా తిరుపతి, నాయక్ లైన్మెన్, రుస్తుమ్, జూనియర్ లైన్మెన్ తదితరులు పాల్గొన్నారు.

శివారు కాలనీల సమస్యల పరిష్కారానికి కృషి



శ్రీరామ మందిర కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, ఆగస్టు 4: నగరంలోని శివారు కాలనీల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు మేయర్ యాదగిరి సునీల్‌రావు పేర్కొన్నారు. ఆదివారం ఆయన 17వ డివిజన్ పరిధిలోని శాతవాహన యూనివర్సిటీ సమీపంలోగల శ్రీరాంనగర్‌కాలనీ రోడ్ నెంబర్7లో నూతనంగా నిర్మించిన శ్రీరామమందిరాన్ని సందర్శించారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఈనెల 28,29,30 తేదీల్లో జరిగే ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలకు నగరపాలక సంస్థ పక్షాన అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం శ్రీరాంనగర్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాల కరపత్రాన్ని మేయర్ ఆవిష్క రించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు శ్రీరాంనగర్ కాలనీలో డ్రైనేజీ, రోడ్లు, వీధిదీపాలు లేవని, మురుగునీరు, వర్షపునీరు ఖాళీ ప్లాట్లలో నిలువడంతో దోమలతో దుర్వాసన, వ్యాధులబారిన పడుతున్నామని, వీటిని పరిష్కరించాలని కోరారు. మేయర్ స్పందిస్తూ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు మేయర్ సునీల్‌రావు. మూడు రోజుల పాటు జరిగే శ్రీరామమందిర విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో పాల్గొంటానని, సంపూర్ణ సహకారాన్ని అందిస్తానన్నారు. శ్రీరాంనగర్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డి.మాధవ రావు, గజవాడ ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొండపల్లి సరిత సతీష్, వెల్ఫేర్ అసోసియేషన్ కోశాధికారి నర్సింహాచారి, ఉపాధ్యక్షులు బల్మూరి విజయసింహా రావు, వసంతరావు, శరత్‌రావు, రాములుశర్మ, శ్రీశైలం, లక్ష్మీనారాయణ, రవి నాయక్ పాల్గొని మేయర్ సునీల్‌రావును సన్మానించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు



హుజూరాబాద్ ప్రభుత్వ పాఠశాల 2007-08 బ్యాచ్ విద్యార్థులు

హుజూరాబాద్/మానకొండూర్/భగత్‌నగర్: హుజూరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిన 2007-08సంవత్సరం బ్యాచ్ విద్యార్థులు, మానకొండూర్‌లోని బాలుర ఉన్నత పాఠశాలలో 1999-2000 సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థులు, కొత్తపల్లి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2005-2006 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుకున్న రోజులను గుర్తు చేసుకుంటూ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.



మానకొండూర్ ప్రభుత్వ పాఠశాల 1999-2000 బ్యాచ్ విద్యార్థులు



కొత్తపల్లి ప్రభుత్వ పాఠశాల2005-06 బ్యాచ్ విద్యార్థులు

భవిష్యత్ తరాలను ఆధ్యాత్మికత, క్రమశిక్షణ వైపు మళ్లించాలి



విద్యార్థులకు బుక్స్, పెన్నులు అందజేస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు

శంకరపట్నం, ఆగస్టు 4: భవిష్యత్ తరాలను ఆధ్యాత్మికత, క్రమశిక్షణ వైపు మళ్లించాలని శ్రీసత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు లింగమూర్తి అన్నారు. ఆదివారం మండలంలోని కరీంపేటలో శ్రీసత్యసాయి సేవా సమితి వారి ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిల్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లింగమూర్తి మాట్లాడుతూ మానవసేవ మాధవసేవ అని, గ్రామ సేవ ద్వారా గ్రామంలో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. భవిష్యత్ తరాలను ఆధ్యాత్మికతవైపు, క్రమశిక్షణ వైపు మళ్లించేందుకు ప్రతి ఒక్కరూ పాటు పడాలన్నారు. అనంతరం గ్రామంలో బాలసేవ, గృహ భజనలు చేసి క్రీడాప్రాంగణం వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి సభ్యులు లక్ష్మీపతి, తనుకు ఓంకారం, నరేష్, మహేష్, వరుణ్, కృష్ణ, సతీష్, రాంప్రసాద్, సౌమ్య, సరిత, సంతోష్, తిరుపతి, శ్రీనివాస్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ స్నేహితుల దినోత్సవం

కరీంనగర్ టౌన్, ఆగస్టు 4: నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సిరిసిల్ల జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో పోపా జిల్లా అధ్యక్షుడు పోలు సత్యనారాయణ, మాజీ సర్పంచు గడ్డం శ్రీరాములు, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ మల్లికార్జున్, మనోహర్‌రెడ్డి, మోహన్, రవీందర్‌రెడ్డి, భూమయ్యపాల్గొన్నారు.

హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో 60ఏళ్ల పైబడి స్నేహం కొనసాగిస్తున్న వృద్ధులు ప్రపంచ స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సారంగపాణి, మునీరుద్దీన్, జన్నయ్య, సారయ్య, రవీందర్‌బాబు, మొగిలి, విద్యానంద్, వెంకటస్వామి పాల్గొన్నారు.

ప్రతిభ కనబర్చే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అండ



పావనిని సన్మానిస్తున్న వొడితెల ప్రణవ్

వీణవంక, ఆగస్టు 4: ప్రతిభ కనబర్చే విద్యార్థులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికి అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. వీణవంక మండలంలోని మామిడాలపల్లి గ్రామానికి చెందిన మూల పావనికి అమెరికాలో ఉచితంగా మాస్టర్స్ చేసేందుకు సీటు రాగా, ప్రణవ్ స్వయంగా ఆదివారం ఆమె ఇంటికి వెళ్లి అభినందించారు. ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ వ్యవసాయ కుటుంబంలో పుట్టి చిన్ననాటి నుంచే చదువులో ప్రతిభ కనబరుస్తూ అమెరికాలో ఉచితంగా మాస్టర్స్ చేసే అవకాశం రావడం గొప్ప విషయమన్నారు. ప్రతిభావంతులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ నుంచి అమెరికాలో ఉన్నత విద్య (మాస్టర్స్) అభ్యసించడానికి నలుగురు విద్యార్థులను ఫెలోషిప్‌నకు ఎంపిక చేయగా, అందులో కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చర్ యూనివర్సిటీలో బీఎస్సీ పూర్తి చేసిన వీణవంక మండలం మామిడాలపల్లి గ్రామానికి చెందిన పావని ఉందన్నారు. అమెరికాలోని అబరాన్ యూనివర్సిటీలో మాస్టర్స్ పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా రెండేళ్లకు రూ. 55.50 లక్షల ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఈ మేరకు పావని తల్లిదండ్రులు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

చర్లబూత్కూర్ గొడవలో ఒకరికి గాయాలు

-మరొకరి ఆత్మహత్యా యత్నం

కరీంనగర్ క్రైం, ఆగస్టు 4 : కరీంనగర్ రూరల్ మండలం చర్లబూత్కూర్‌లో ఆదివారం జరిగిన ఒక గొడవలో నారాయణ అనే వ్యక్తికి గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. ఈ గొడవలో మనస్థాపానికి గురైన శ్రీను అనే వ్యక్తి సుల్తానాబాద్ పరిధిలో పురుగుల మందు తాగగా అక్కడ కేసు నమోదైనట్లు సమాచారం. పురుగుల మందుతాగిన వ్యక్తి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉందని తెలిసింది. కాగా గొడవకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు.

దేవాలయాలు హైందవ సమాచార కేంద్రాలుగా మారాలి

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 4: హిందూ దేవాలయాలు హైందవ సమాచార కేంద్రాలుగా మారాలని, సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. నగరంలోని వైశ్యభవన్‌లో స్వామి వివేకానంద విద్యాపరిషత్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం దేవాలయాల ఏకీకరణ-హైందవ చైతన్య వేదిక అంశంపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ హిందువులంతా ఐక్యంగా ఉండాలని అన్నారు. పట్టణంలో పలు ఆలయాల్లో పని చేస్తున్న 200 మంది అర్చకులు, పూజారులకు సన్మానం చేశారు. పురాణం మహేశ్వరశర్మ, సురేశ్ ఆత్మారాం మహరాజ్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సీనియర్ న్యాయవాది, కేంద్ర ప్రభుత్వ స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్ రమేశ్ బాబు విశ్వనాథం పాల్గొన్నారు. కార్యక్రమంలో పొలాస రాంకిరణ్, యెల్లంకి అనిల్‌కుమార్, తుడి కల్యాణ్, డాక్టర్ శేషశైలజ, డాక్టర్ వేముల శ్రీనివాస్, ప్రియాంకారావు, పబ్బా అరుణ, రామక లావణ్య, రాంమ్మోహన్ పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో షుగర్ పరీక్షలు

భగత్‌నగర్, ఆగస్టు 4: లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ భగత్‌నగర్ ఆధ్వర్యంలో ఆదివారం భగత్‌నగర్ చౌరస్తా, జ్యోతినగర్, కెడిఆర్ పార్కు వద్ద ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహించారు. 200మందికి షుగర్‌నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, డయాబెటిక్ గురించి అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో భగత్‌నగర్ అధ్యక్షుడు సిరిపురం ప్రసాద్, కార్యదర్శి బాల రత్నం, కోశాధికారి రామచంద్రం, జాయింట్ సెక్రటరీ ప్రసాదరావు, డయాబెటిక్ కో-ఆర్డినేటర్ రవీందర్, క్యాబినెట్ మెంబర్ రాజిరెడ్డి పాల్గొన్నారు.

బోనాల జాతర

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 4: స్థానిక 28 డివిజన్ ఆదర్శనగర్‌లో జరిగిన పోచమ్మ బోనాల జాతర, 46వ డివిజన్‌లో నూతన మైసమ్మ దేవాలయ ప్రారంభోత్సవంలో ఆదివారం మేయర్ సునీల్‌రావు పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ నాంపల్లి శ్రీనివాస్, వంగల శ్రీదేవీపవన్, మాజీ కార్పొరేటర్లు మాచెర్ల ప్రసాద్, గొట్టిముక్కల ఉమారమణ పాల్గొన్నారు.

ప్రైవేట్ ఉపాధ్యాయులను హేళన చేస్తూ మాట్లాడటం సరికాదు

కరీంనగర్ టౌన్, ఆగస్టు 4: ప్రైవేట్ పాఠశాలల్లో క్రమశిక్షణతో కూడిన మెరుగైన విద్యనందిస్తూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేస్తున్న ప్రైవేట్ పాఠశాలల టీచర్లను హేళన చేస్తూ కించపరిచే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడటం సరికాదని బీఎస్ రావు ఫౌండేషన్ చైర్మన్, ఐఎంఎ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ బీఎస్‌రావు ఒక ప్రకటనలో ఖండించారు.

టీచర్ల పట్ల సీఎం మాట్లాడటం మానుకొని, వారిని గౌరవించడం నేర్చుకోవాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించి, ప్రైవేట్‌కు దీటుగా తీర్చిదిద్దాలని సూచించారు.

మేర సంఘం జిల్లా కార్యవర్గం

గణేశ్‌నగర్, ఆగస్టు4: కరీంనగర్ మేర సంఘం జిల్లా అధ్యక్షుడిగా మాడిశెట్టి భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా మల్లికార్జున్ ఎన్నికైనట్లు మేర సంఘం ఎన్నికల అధికారి తెలిపారు. ఆదివారం నగరంలోని ఉజ్వల పార్క్ వద్దగల మేర సంగం భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గెలుపొందిన పలువురు ప్రమాణ స్వీకారం చేశారు.

ఎన్నికల అధికారి మాడిశెట్టి కిష్టయ్య వ్యవహరించగా కోశాధికారిగాగా కొత్తకొండ లక్ష్మణ్, నగర అధ్యక్షునిగా నోముల రమేష్, ప్రధాన కార్యదర్శిగా వొడేల రవీందర్, కోశాధికారిగా మాడిశెట్టి రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఏఈఈగా ఎంపికైన పెర్కపల్లి యువకుడు

సైదాపూర్, ఆగస్టు 4: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమీషన్ ప్రకటించిన అసిస్టెంట్ ఇంజనీర్ ఫలితాల్లో సైదాపూర్ మండలంలోని పెర్కపల్లి గ్రామానికి చెందిన పోతరాజు విజయ-మల్లయ్య దంపతుల కుమారుడు పోతరాజు నవీన్ ఏఈఈగా ఎంపికయ్యాడు. ఇప్పటికే నవీన్ సోదరి మౌనిక జెన్కోలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేస్తుంది. తల్లితండ్రులు, సోదరి మౌనిక, సోదరుడు కర్ణాకర్ ప్రోత్సాహంతో కష్టపడి చదివి ఉద్యోగం సాధించానని నవీన్ తెలిపాడు. కష్టపడి చదివి ఒకే ఇంట్లో ఇద్దరు ఉద్యోగం సంపాదించడంపై కుటుంబసభ్యులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

యువజన సంఘం కమిటీ అధ్యక్షుడిగా పురాణం రమేష్

రామడుగు, ఆగస్టు 4: మండలంలోని గోపాల్‌రావుపేట బుడగ జంగం(ఎస్సీ) యువజన సంఘం సభ్యులు ప్రత్యేక సమావేశం నిర్వహించి నూతన కమిటీని ఎన్ను కున్నారు. అధ్యక్షుడిగా పురాణం రమేష్‌ను, గౌరవ అధ్యక్షు లుగా కళ్లెం విజయ సిద్దార్థ, పురాణం సంపత్, ఉపాధ్యక్షు లుగా భూతం మల్లేష్, తూర్పాటి అనిల్, ప్రధాన కార్యదర్శి గా విభూది రమేష్, ఉప కార్యదర్శిగా విభూది మహేందర్, కోశాధికారులుగా కళ్లెం తిరుపతి, చల్ల కుమార్, సలహాదారులుగా టేకు గోపి, కిన్నెర యాదగిరి, కళ్లెం వెంకటేష్, కళ్లెం శివాజీలను యువకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆటో యూనియన్ అధ్యక్షుడిగా శ్రీనివాస్

రామడుగు, ఆగస్టు 4: రామడుగు రామాంజనేయ ఆటో యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కర్నె శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా చంద అనిల్, ప్రధాన కార్యదర్శిగా గాచంటి వెంకటేష్, కోశాధికారిగా అనుపురం మల్లేషంను, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బొల్లి ఐలయ్యకు సన్మానం

చిగురుమామిడి,అగస్టు 4: మండల కేంద్రానికి చెందిన బొల్లి ఐలయ్యకు ఇటీవల డాక్టరేట్ అవార్డు వచ్చిన సందర్భంగా నల్గొండ జిల్లా నకిరేకల్‌లో జరిగిన నేషనల్ కరాటే టోర్నమెంట్‌లో ఎమ్మెల్యే వేముల వీరేశం అదివారం సన్మానించారు. ఐలయ్య కరాటేలో, ఇతర సామాజిక కార్యక్రమంలో పాల్గొంటూ డాక్టరేట్ సాధించడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు.

రాజరాజేశ్వరి క్లబ్ ఆధ్వర్యంలో అల్పాహార వితరణ

సుభాష్‌నగర్, ఆగస్టు 4: రాజరాజేశ్వరి లయన్స్‌క్లబ్ సభ్యురాలురాళ్ల బండి శశికల జన్మదిన సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో అల్పాహార వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో శశికళ శంకర్ ప్రసాద్ రెడ్డి, క్లబ్ కార్యదర్శి నరహరి లక్ష్మారెడ్డి, క్లబ్ మెంబర్ ఊకంటి సంపతి కుమారి, లంబు రాజిరెడ్డి, లంబు సుధాకర్ రెడ్డి, ఏ రవీందర్ రెడ్డి, రావి కంటి కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు